సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాట స్ఫూర్తితో దేశ సార్వభౌమత్వాన్ని నిలబెట్టుకునేందుకు ఉద్యమాలు చేయాల్సిన పరిస్థితి దాపురించిందని వక్తలు విమర్శించారు. యంగ్ వర్కర్స్ కమిటీ (సిఐటియు) ఆధ్వర్యంలో శుక్రవారం హైదరాబాద్‌లోని గోల్కొంగ చౌరస్తాలో కాగడాల ప్రదర్శన నిర్వహిం చారు. 'లాంగ్‌లీవ్ వర్కర్స్ యూనిటీ, లాంగ్‌లీవ్ రివెల్యూషన్, సామ్రాజ్యవాదం నశించాలి, మత సామరస్యత వర్థిల్లాలి, మతోన్మాదం నశించాలి, అమెరికన్ సామ్రాజ్యవాదానికి సాగిల పడుతున్న మోడీ విధానాలు డౌన్..డౌన్ అంటూ యంగ్ వర్కర్స్ నినాదాలు చేశారు. అనంతరం సీఐటీయూ నగర అధ్యక్షులు ఎం దశరథ్ అధ్యక్షతన రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి తిరోగమన విధానాల నుంచి దేశ స్వాతంత్ర్యాన్ని కాపాడుకోవాలన్నారు. లౌకిక విధానాన్ని, సార్వభౌమత్వాన్ని నిలబెట్టుకోవాల్సిన అవశ్యక ఏర్పడిందని చెప్పారు. అమెరికన్ సామ్రాజ్య వాదం ప్రపంచ ఆధిపత్యం కోసం దూకుడుగా వ్యవహరిస్తున్నదనీ, ఈ నేపథ్యంలో తన మాట వినని దేశాలపై కక్ష సాధింపులకు పోతున్నదని చెప్పారు. దేశభక్తియుత శక్తులు సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడాల్సిన అవసరం పెరిగిందని చెప్పారు. మోడీ ప్రభుత్వం అదేశానికి సాగిలపడుతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. ఇది దేశ సార్వభౌమాధి కారానికి విఘాతమని చెప్పారు. మత సామరస్యం కోసం, అసమానతలు లేని సమాజం కోసం యంగ్ వర్కర్స్ పాటుపడాలని సూచించారు. సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్ వీరయ్య మాట్లాడుతూ దేశ స్వాతంత్రోద్యమంలో అణువంత సంబంధంలేని ఆర్ఎస్ఎస్, దాని అనుబంధ బిజెపి కేంద్రంలో అధికారంలో ఉందని చెప్పారు. మోడీ ప్రభుత్వం అమెరికన్ సామ్రాజ్య వాదంతో అవమాన కరమైన పలు ఒప్పందాలు చేసుకుంటుందని ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో దేశ ప్రజలపై తీవ్ర భారాలు పడుతున్నాయని చెప్పారు. పోరాడి సాధించుకున్న స్వాతంత్రతను నిలబెట్టుకోకుండా సాగిల పడే వైఖరిని అనుసరించటం అవమానకరమన్నారు. మరో పక్క తిరంగ్ యాత్ర అంటూ ఆర్బాటం చేస్తున్నారని ఎద్దేవా చేశారు. అసలు తిరంగ్ యాత్ర చేసే నైతిక హక్కు బిజెపి లేదని చెప్పారు. స్వాతంత్రోద్యమం కోసం ప్రాణాలర్పించిన గాంధీ, భగత్‌సింగ్, అల్లూరి, ఆజాద్ లాంటి ఎందరో వీరుల పోరాట స్ఫూర్తితో యంగ్ వర్కర్స్ సామరస్యత కోసం నిలబడాల్సిన అవసరముందన్నారు. సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ ఎన్నో పోరాటాల ఫలితంగా ఈ దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిందని చెప్పారు. ఆ పోరాటంలో ఎలాంటి సంబంధంలేని ఆర్ఎస్ఎస్, బిజెపి శక్తులు నేడు దేశ భక్తి ముసుగులో దేశ సమైఖ్యతకు విఘాతం కలిగిస్తున్నాయని విమర్శించారు. మోడీ అధికారంలోకొచ్చినప్పటి నుంచి రాజ్యాంగ లక్ష్యాలకు విఘాతం కలిగిస్తున్నదని చెప్పారు. సంపద సృష్టి కర్తలైన శ్రామిక వర్గంపై దాడి చేస్తున్నదని తెలిపారు. తద్వారా కార్పొరేట్ శక్తులు లాభాలు గడించేందుకు అనుకూలంగా విధానాలను రూపొందిస్తున్నదని తెలిపారు. ఇలాంటి తిరోగమన విధానాల పట్ల యంగ్ వర్కర్స్ అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర కోశాధికారి వంగూరు రాములు, ఉపాధ్యక్షులు ఎస్‌వి రమ, కార్యదర్శులు జె వెంకటేష్, కూరపాటి రమేశ్, యంగ్ వర్కర్స్ కన్వీనర్ పి శ్రీకాంత్, రాష్ట్ర కమిటీ సభ్యులు యాటాల సోమన్న, రొయ్యల రాజు, సునీత, భారతి, కామేష్‌బాబు, భారతి, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

ఏఐ విస్తరణకు హెచ్‌సిఎల్‌టెక్, నెట్‌యాప్ భాగస్వామ్యం

నోయిడా: వ్యాపార సంస్థల్లో ఏఐ వినియోగాన్ని వేగవంతం చేసేందుకు హెచ్‌సిఎల్ టెక్, నెట్‌యాప్ భాగస్వామ్యాన్ని విస్తరించాయి. హైబ్రిడ్ క్లౌడ్ స్టోరేజ్-యాజ్-ఎ-సర్వీస్ పరిష్కారాన్ని అందించనున్నాయి. దీని ద్వారా సంస్థలు తమ అవసరాలకు అనుగుణంగా స్టోరేజ్, డేటా సేవలను పెంచుకోవచ్చని తెలిపాయి. బలమైన డేటా మేనేజ్ మెంట్‌తో కస్టమర్ల ఏఐ ప్రయాణాన్ని వేగవంతం చేయడమే లక్ష్యమని హెచ్‌సిఎల్‌టెక్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ రాంపాల్ సింగ్ తెలిపారు.

మహీంద్రా నుంచి బ్లాజో ఐ-ట్రక్

ముంబయి : వాహన యజమానుల లాభాలను పెంచే లక్ష్యంతో మహీంద్రా ట్రక్ అండ్ బస్ 'బ్లాజో ఐ-ట్రక్'ను ఆవిష్కరించినట్లు ఆ సంస్థ తెలిపింది. ఏఐ ఆధారిత ఐఫ్యూయెల్‌స్మార్ట్ ఆటో డ్రైవ్ మోడ్, 320 హెచ్‌పీ ఇంజిన్, ఐమ్యాక్స్ 2.0 టెలిమాటిక్స్‌తో రూపొందిన ఈ ట్రక్ 10 శాతం అధిక ఇంధన సామర్థ్యాన్ని అందిస్తుందని పేర్కొంది. ఐదేళ్లలో రూ.15 లక్షల వరకు అదనపు లాభం, 48 గంటల అప్‌టైమ్ గ్యారెంటీని ప్రకటించింది. సాంకేతికత, విశ్వసనీయతతో లాజిస్టిక్స్ రంగానికి కొత్త వృద్ధి అందించడమే లక్ష్యమని మహీంద్రా గ్రూప్ ప్రెసిడెంట్ వినోద్ సహాయ్ తెలిపారు.

రైతుల కోసం 'నికా-2 కిసాన్' డ్రోన్ ఆవిష్కరణ

హైదరాబాద్: నగరానికి చెందిన అజిన్ అవలిటిక్స్ రూపొందించిన 'నికా-2 కిసాన్' డ్రోన్‌ను కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ఆవిష్కరించారు. 16 లీటర్ల ద్రావణాలను పిచికారీ చేయడంతో పాటు 12 లీటర్ల విత్తనాలు, ఎరువులను చల్లే సామర్థ్యం దీనికి ఉంది. కొండ ప్రాంతాల్లో ఎత్తును స్వయంచాలకంగా సర్దుబాటు చేసుకోవడం దీని ప్రత్యేకతలు. రైతుల సమస్యలకు స్వదేశీ సాంకేతికత తో పరిష్కారాలు అందించడమే లక్ష్యమని సంస్థ ఫౌండర్ జానకి పులపర్తి తెలిపారు.

డెలివరీ 'కార్నర్స్ ఆఫ్ కరేజ్' క్యాంపెయిన్

న్యూఢిల్లీ: 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని లాజిస్టిక్స్ సంస్థ డెలివరీ 'కార్నర్స్ ఆఫ్ కరేజ్' ప్రచారాన్ని ప్రారంభించింది. దేశంలోని విస్మరణకు గురైన 80 ప్రాంతీయ స్వాతంత్ర్య పోరాట గాథలను వెలుగులోకి తీసుకురావడం దీని ఉద్దేశం. తమ విస్తృత లాజిస్టిక్స్ నెట్‌వర్క్ ద్వారా దేశంలోని త్యాగగాథలను ప్రజలకు పరిచయం చేస్తున్నామని డెలివరీ మార్కెటింగ్ హెడ్ మహమ్మద్ అలీ తెలిపారు.

రూ.16,007 కోట్లతో రోడ్ల అభివృద్ధి

ములుగులో పైలాన్

ఆవిష్కరించనున్న ముఖ్యమంత్రి

రాష్ట్రంలో 7,448 కిలోమీటర్ల మేర రహదారుల అభివృద్ధి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర గ్రామీణ రవాణా రంగంలో సరికొత్త అధ్యాయానికి ములుగు జిల్లా వేదిక కానుంది. గ్రామాలు, మండల కేంద్రాలు, ప్రధాన రహదారుల మధ్య మెరుగైన అనుసంధానం కల్పించే లక్ష్యంతో ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టనున్న భారీ రహదారి అభివృద్ధి కార్యక్రమానికి ఈ నెల 16న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ములుగు నుంచి శ్రీకారం చుట్టనున్నారు. సుమారు రూ.16,007 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న ఈ కార్యక్రమానికి గుర్తుగా ములుగు జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన పైలాన్‌ను ముఖ్యమంత్రి ఆవిష్కరించనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో రవాణా వ్యవస్థను బలోపేతం చేసేందుకు తొలి దశలో 2,145 రహదారులను సుమారు 7,448 కిలోమీటర్ల మేర అభివృద్ధి చేయనున్నారు. గ్రామ పంచాయతీల నుంచి మండల కేంద్రాలు, అక్కడి నుంచి ప్రధాన రహదారులకు నిరంతర అనుసంధానం కల్పించేలా ఈ ప్రణాళికను రూపొందించారు. గ్రామీణ రవాణా వ్యవస్థను సమూలంగా మార్చడంతో పాటు పల్లెల నుంచి పట్టణ ప్రాంతాల వరకు మెరుగైన రహదారి అనుసంధానం కల్పించాలనే దూరదృష్టితో ప్రభుత్వం బృహత్తర కార్యాచరణకు రూపకల్పన చేసింది. ప్రతి గ్రామాన్ని మండల కేంద్రంతో రెండు వరుసల రహదారితో, మండల కేంద్రాన్ని జిల్లా కేంద్రంతో నాలుగు వరుసల రహదారితో, జిల్లా కేంద్రాన్ని రాష్ట్ర కేంద్రంతో ఆరు వరుసల రహదారితో అనుసంధానించాలన్నది ప్రభుత్వ లక్ష్యం. పంచాయతీరాజ్ పరిధిలోని రహదారులను పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో అభివృద్ధి చేసేలా ప్రణాళిక రూపొందించారు. ప్రభుత్వం, బ్యాంకులు, నిర్మాణ సంస్థల భాగస్వామ్యంతో ఆర్థిక వనరులను సమకూర్చుకొని ఈ భారీ రహదారి కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో కార్యరూపంలోకి తీసుకురానున్నారు. మెరుగైన రహదారులు గ్రామీణ ప్రజల జీవన విధానంలో ప్రత్యక్ష మార్పు తీసుకురానున్నాయి. రైతులు తమ పంటలను మార్కెట్లకు సులభంగా తరలించుకోవడం, విద్యార్థులు విద్యాసంస్థలకు సౌకర్యవంతంగా చేరుకోవడం, అత్యవసర పరిస్థితుల్లో వైద్య సేవలు వేగంగా అందుకోవడం, ఉపాధి అవకాశాలు విస్తరించడం వంటి అనేక ప్రయోజనాలు కలుగనున్నాయి.

ముఖ్యంగా అటవీ, గిరిజన ప్రాంతాలు అధికంగా ఉన్న ములుగు వంటి జిల్లాలకు మెరుగైన రహదారి అనుసంధానం అభివృద్ధికి కీలకంగా మారనుంది. రహదారుల నిర్మాణాన్ని హైబ్రిడ్ యాన్యుటీ విధానంలో చేపట్టనున్నారు. నిర్మాణ వ్యయంలో ప్రభుత్వం, నిర్మాణ సంస్థలు భాగస్వామ్యం కానుండగా, పనుల పూర్తయిన అనంతరం కూడా నాణ్యతకు ప్రాధాన్యం ఇచ్చేలా దీర్ఘకాలిక నిర్వహణ విధానాన్ని అమలు చేయనున్నారు. నిర్మాణం పూర్తయిన తర్వాత 15 సంవత్సరాల పాటు సంబంధిత నిర్మాణ సంస్థలే రహదారుల నిర్వహణ బాధ్యతలు చేపట్టేలా ప్రణాళిక రూపొందించారు. దీంతో రహదారుల నిర్మాణంతో పాటు వాటి నాణ్యత, మన్నికకు కూడా భరోసా కలుగనుంది.

ఈ బృహత్తర రహదారి అభివృద్ధి కార్యక్రమానికి ములుగు జిల్లా వేదిక కావడం ప్రత్యేక ప్రాధాన్యం సంతరించుకుంది. రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క ప్రాతినిధ్యం వహిస్తున్న ములుగు నియోజకవర్గం నుంచే, ఆమె శాఖ సంబంధించిన రాష్ట్రస్థాయి ప్రతిష్ఠాత్మక కార్యక్రమానికి శ్రీకారం చుట్టనుండటం విశేషం. అటవీ, గిరిజన, ఏజెన్సీ ప్రాంతాలు అధికంగా ఉన్న ములుగు జిల్లాను ప్రారంభ వేదికగా ఎంపిక చేయడం ద్వారా మారుమూల ప్రాంతాల రహదారి అనుసంధానానికి ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యం స్పష్టమవుతోంది. గ్రామీణ, గిరిజన ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి మెరుగైన రహదారులే కీలకమన్న లక్ష్యంతో ప్రభుత్వం చేపట్టిన ఈ మహత్తర కార్యక్రమం ములుగు నుంచే ప్రారంభం కావడం జిల్లాకు గర్వకారణంగా నిలవడంతో పాటు, ఏజెన్సీ ప్రాంతాల అభివృద్ధికి మరింత ఊతమివ్వనుంది.

సిఎం ఆవిష్కరించనున్న పైలాన్

చేతబడులపై రేవంత్ చెత్త భాష

- ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

క్షుద్రపూజలు, చేతబడులపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెత్త భాష మాట్లాడారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ విమర్శించారు. ఇంత దిగజారి వ్యవహారాలు చేసే సిఎం అయ్యారని అని ప్రశ్నించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని తెలంగాణభవన్‌లో సంజయ్‌కుమార్ విలేకర్లతో మాట్లాడారు. ఆధునిక యుగం, సైన్స్ యుగంలో సిఎం రేవంత్ క్షుద్ర భాష మాట్లాడుతున్నారని విమర్శించారు. భవిష్యత్తు తరాలకు ఆయన ఏం సందేశం ఇస్తున్నారని ప్రశ్నించారు. ఆయన డాక్టర్లకు చూపించాలని రేవంత్ భార్యకు విజ్ఞప్తి చేశారు. ఆయన ఆలోచనలో, భాషలో కుటుంబ సభ్యులు మార్పు తీసుకురావాలని కోరారు. కొత్త పింఛన్ దరఖాస్తుల్లో బీసీ కార్మికుల కాలమ్ పెట్టలేదని తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలో పాలకులు బీసీ కార్మికులను పట్టించుకోలేదని ఆరోపించారు. కెసిఆర్ సిఎం అయిన తర్వాతే బీసీ కార్మికులకు మంచిరోజులు వచ్చాయన్నారు. ఇప్పటికైనా సిఎం జ్ఞానం తెచ్చుకుని ప్రవర్తించాలని గుర్తు చేశారు. మాజీ మేయర్ చైర్మన్ వై.సతీష్ రెడ్డి, బిసి కమిషన్ మాజీ సభ్యులు ఉపేంద్ర చారి పాల్గొన్నారు.

పేదలకు ఉచితంగా ఇళ్లు ఇవ్వాలి : తలసాని

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కాంగ్రెస్ ప్రభుత్వానికి పేద ప్రజలపై ఏ మాత్రం ప్రేమ ఉన్నా ఉచితంగా ఇండ్లు నిర్మించి ఇవ్వాలని మాజీమంత్రి, బీఆర్ఎస్ శాసనసభా పక్ష ఉపనేత తలసాని శ్రీనివాస్ యాదవ్ డిమాండ్ చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ... పేదలు ఆత్మగౌరవంతో బతకాలనే ఆలోచనతో దేశంలో ఎక్కడా లేని విధంగా నాటి ముఖ్యమంత్రి కెసిఆర్ 560 గజాల స్థలంలో అన్ని సౌకర్యాలతో కూడిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను నిర్మించి ఇచ్చారని చెప్పారు. జీహెచ్ఎంసీ పరిధిలో 109 ప్రాంతాల్లో లక్ష డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణం చేపట్టి వాటిలో 69 వేల ఇండ్లను అర్హులైనవారికి పారదర్శకంగా ఇచ్చారని తెలిపారు. కోట్లాది రూపాయల విలువ చేసే స్థలాల్లో తాము ఇండ్లు నిర్మించామని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఇండ్లు ఎక్కడ నిర్మించిందని సిఎం ప్రశ్నిస్తున్నారు కదా?... మా వెంట వస్తే చూపిస్తామని సవాల్ చేశారు. కొల్లూరు ప్రాంతంలో ఒకేచోట 16 వేల ఇండ్లను నిర్మించామని, ఆసియా ఖండంలోనే అత్యధిక గృహ సముదాయం ఉన్న ప్రాంతంగా గుర్తింపు పొందిందని చెప్పారు. లబ్దిదారుల వద్ద రూ. ఆరు లక్షలు తీసుకుంటే మీరు ఇందిరమ్మ ఇండ్లు అని పేరు పెట్టుకున్నారని విమర్శించారు. ఎన్ని గజాల స్థలంలో ఇళ్లు నిర్మిస్తారో ప్రభుత్వం స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. ఇళ్ల కోసం రూ.10 వేలు దరఖాస్తులతో పాటు చెల్లించాలని చెప్పడం ఎంత వరకు సబబని ప్రశ్నించారు. 22 ఏ ను తీసుకొచ్చి పేదల భూములకు ఆంక్షలు పెట్టి, ఇప్పుడు మీ భూమి మీకే ఇప్పిస్తామని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. పేద ప్రజల భూములు, ఇళ్లను 22 ఏ లో పెట్టే అధికారం మీకు ఎవరు ఇచ్చారని ప్రశ్నించారు. 22 ఏ ను అడ్డం పెట్టుకొని 30 నుండి 40 శాతం పర్సెంటేజీల దందా ఎవరు చేస్తున్నారో అందరికీ తెలుసన్నారు.

ఫిన్‌టెక్ ఈకోసిస్టమ్‌గా గోల్డెన్‌సిల్వర్.షాప్

- ఒకే వేదికపైకి బహుళ సేవలు
- నిహార్ ఇన్ఫో గ్లోబల్ చైర్మన్ సూర్యనారాయణ వెల్లడి

ప్రజాశక్తి - హైదరాబాద్

దేశీయ డిజిటల్ ఈ-కామర్స్, ఐటి పరిష్కారాల సంస్థ 'నిహార్ ఇన్ఫో గ్లోబల్ లిమిటెడ్' తమ ఫ్లాగ్‌షిప్ పోర్టల్ గోల్డెన్ సిల్వర్.షాప్ కార్యకలాపాల్లో విప్లవాత్మక మార్పులు చేపట్టినట్లు వెల్లడించింది. ఇప్పటి వరకు సాధారణ ఈ-కామర్స్ సైట్‌గా సేవలు అందించిన ఈ ప్లాట్‌ఫామ్... ఇకపై పూర్తిస్థాయి డిజిటల్ గోల్డ్, సిల్వర్ బిల్లింగ్, ఫిన్‌టెక్ ఈకోసిస్టమ్‌గా తీర్చిదిద్దుతున్నట్లు ఆ కంపెనీ చైర్మన్ బిజినెస్ సూర్యనారాయణ వెల్లడించారు. శుక్రవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈ నూతన పునర్నిర్మాణ విధానంలో భాగంగా వినియోగదారుల, పెట్టుబడుల కోసం ఒకే వేదికపైకి బహుళ సేవలను కంపెనీ అందుబాటులోకి తెస్తోన్నామన్నారు. భౌతిక రూపంలో లభించే పసిడి, వెండి నాణేలు, బిస్కట్లతో పాటు డిజిటల్ రూపంలోనూ మదుపు చేసేందుకు వీలుగా ఎఎంటిసి, పిఎఎంపి, సేఫ్‌గోల్డ్, ఆగ్మాంట్ భాగస్వామ్యంతో డిజిటల్ గోల్డ్, సిల్వర్ సేవలను ఈ పోర్టల్‌పై పునఃప్రారంభించనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం ఈ సేవలు వెబ్‌వర్షన్‌లో లభిస్తున్నాయని.. వచ్చే ఏడాది జనవరి కల్లా యాప్‌ను ఆవిష్కరిస్తామని చెప్పారు. ఒకే వేదిక.. బంగారం, వెండిలో పెట్టుబడులకు ఎన్నో మార్గాలు అనేదే తమ ప్రధాన లక్ష్యమన్నారు. అదే విధంగా జెరోధా ద్వారా భారతీయ గోల్డ్ ఇటిఎఫ్‌లు, నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ అంతర్జాతీయ విభాగాలు ద్వారా అంతర్జాతీయ ఇండెక్స్ ఇటిఎఫ్‌లను కొనుగోలు చేసే వెసులుబాటును పెట్టుబడిదారులకు కల్పిస్తోన్నామన్నారు. డిజిటల్ అసెట్స్‌ను సులభంగా భౌతిక బంగారం లేదా వెండిగా మార్చుకునే సదుపాయాలను ఈ ప్లాట్‌ఫామ్‌లో పొందుపరిచారు. వీటితో పాటు వినూత్నంగా బ్యాంకులు, ప్రముఖ నాన్-బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీల భాగస్వామ్యంతో డిజిటల్ గోల్డ్ లోన్ డిస్కవరీ పోర్టల్ సేవలను అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు.

గోవా గార్డియన్స్ ట్రోఫీలో హైదరాబాద్ బ్లాక్‌హాక్స్ విజయం

- జట్టులో నలుగురు తెలుగు క్రీడాకారులు

హైదరాబాద్ : ప్రైమ్ వాలీబాల్ లీగ్ (పివిఎల్) ఫ్రాంచైజీ హైదరాబాద్ బ్లాక్‌హాక్స్ అండర్-21 గోవా గార్డియన్స్ ట్రోఫీలో శుభారంభం చేసింది. బెంగళూరుతో జరిగిన తమ తొలి మ్యాచ్‌లో హైదరాబాద్ 3-0 (15-8, 15-13, 16-14) తేడాతో వరుస సెట్లలో ఘనవిజయం సాధించింది. ఇటీవల విజయవాడలో నిర్వహించిన అండర్-21 ట్రయల్స్‌కు 105 మంది హాజరుకాగా, వారి నుంచి ఎంపిక చేసిన 12 మంది సభ్యుల తుది జట్టులో కార్తిక్ (గుంటూరు), ధీమన్ (విశాఖపట్నం), ప్రనీక్ (పెద్దపల్లి), అక్షిత్ (వరంగల్) అనే నలుగురు తెలుగు క్రీడాకారులకు చోటు దక్కింది. పివిఎల్‌లోని పది జట్లు పోటీపడుతున్న ఈ టోర్నీ ద్వారా యువ క్రీడాకారులకు తమ ప్రతిభను చాటుకునేందుకు అద్భుత అవకాశం లభించిందని ప్రతినిధులు తెలిపారు.

బిసి కులాల ప్రస్తావన లేని కేంద్ర గెజిట్

- రాష్ట్ర బిసి కమిషన్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రెండో విడత జనాభా గణనలో బిసి కులాల వివరాలను సేకరిస్తామని గతంలో కేంద్ర ప్రభుత్వం హామీ ఇచ్చిందని రాష్ట్ర బిసి కమిషన్ చైర్మన్ జి.నిరంజన్ గుర్తుచేశారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఆ హామీని పక్కన పెట్టి తాజాగా కేంద్ర హోం శాఖ విడుదల చేసిన గెజిట్ లో బిసి కులాల ప్రస్తావనను విస్మరించడం పట్ల ఆయన విస్మయం వ్యక్తం చేశారు. జనాభా గణనలో సేకరించదలచిన అంశాలను ప్రస్తావిస్తూ కేంద్ర ప్రభుత్వం వెంటనే ఒక స్పష్టత ఇవ్వవలసిన అవసరం ఉన్నదని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ విషయమై బిసి కమిషన్ రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా, సెన్సెస్ కమిషనర్ కు లేఖ రాయనున్నట్లు తెలిపారు.

విద్యుదాఘాతంతో తండ్రీ, కొడుకుల మృతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వ్యవసాయ పొలంవద్ద పనులు ముగించుకొని ఇంటికి వస్తున్న నేపథ్యంలో బోర్ మోటార్‌కు బిగించిన వంక పైప్‌ను తిప్పుతుండగా ప్రమాదవశాత్తు విద్యుద్ఘాతంతో తండ్రీ, కొడుకులు మృతి చెందిన సంఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలంలోని గంగారం గ్రామ పరిధిలోని మార్కాపేటపల్లిలో చోటు చేసుకుంది. స్థానికులు, కొయ్యూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...మార్కాపేటపల్లికి చెందిన కట్టికొల బాపు(40), కట్టికొల మనోజ్ (23) తండ్రీ, కుమారుడు కొండంపేట రెవెన్యూ గ్రామ శివారులోని రోడ్డు వద్ద ఉన్న తమ వ్యవసాయ పొలంలో పనులు చేసేందుకు వెళ్లారు. పనులు ముగించుకుని సాయంత్రం ఇంటికి వచ్చేక్రమంలో బోర్‌మోటర్‌కు ఉన్న వంకపైపును సరిచేస్తున్న క్రమంలో విద్యుదాఘాతానికి ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. పొలం పనులకు వెళ్లిన తండ్రీ కొడుకులు రాత్రి అయినా ఇంటికి చేరక పోవడంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు తెలిసిన వారిని, బంధువులను వాకాబు చేసినా ఆచూకీ లభించలేదు. దీంతో శుక్రవారం ఉదయం వారిని వెదుకుతూ పొలం వైపు వెళ్లగా బాపు, మనోజ్‌లు విగతజీవులుగా కనిపించడంతో కన్నీరుమున్నీరుగా విలపించారు. బాపు భార్య రాజక్క ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మహేందర్ కుమార్ తెలిపారు. తండ్రీ కొడుకులు మృతి చెందడంతో గంగారం గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ప్రభుత్వం రైతు కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నాణ్యతలో ఎలాంటి రాజీ పడొద్దు

- ఈ నెలాఖరుకు టెండర్ల ప్రక్రియ పూర్తి చేయండి
- సెప్టెంబర్ మొదటివారంలో పనులు ప్రారంభించాలి
- 'గోదావరి పుష్కరాలు – 2027'పై మంత్రి శ్రీధర్‌బాబు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం 'గోదావరి పుష్కరాలు-2027' నిర్వహణను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నదని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. సెప్టెంబర్ మొదటి వారంలో పనులు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఆ మేరకు టెండర్ ప్రక్రియను ఆగస్టు చివరి నాటికి పూర్తి చేయాలని స్పష్టం చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో శ్రీధర్‌బాబు అధ్యక్షతన 'గోదావరి పుష్కరాలు – 2027' మంత్రివర్గ ఉపసంఘం సమావేశంలో మంత్రులు కొండా సురేఖ, తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, సీతక్క, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, వివేక్ వెంకటస్వామి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు శాఖలవారీగా సన్నద్ధత, ఏర్పాట్ల పురోగతిని ప్రత్యేకంగా సమీక్షించి అధికారులకు దిశానిర్దేశం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గోదావరి పుష్కరాలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.వేయి కోట్లు కేటాయించిందన్నారు. యాత్రికుల రద్దీ అధికంగా ఉండే టైర్-1 ప్రాంతాలకు ప్రత్యేకంగా స్పెషల్ ఆఫీసర్లను నియమించాలని ఆదేశించారు. అలాగే ముఖ్యమైన ప్రాంతాల్లో ప్రత్యేకంగా కమాండ్ కంట్రోల్ సెంటర్లను ఏర్పాటు చేయాలని సూచించారు. నిర్దేశిత గడువులోగా పనులు పూర్తయ్యేలా సంబంధిత శాఖ ఉన్నతాధికారులు తీసుకోవాలని స్పష్టం చేశారు. అయితే నాణ్యతలో రాజీ పడొద్దని, పనుల పురోగతిని పర్యవేక్షించేందుకు సంబంధిత అధికారులు నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యటించాలని స్పష్టం చేశారు. వర్క్ ప్రోగ్రెస్ ను రోజువారీగా తెలుసుకునేలా ప్రత్యేక డ్యాష్ బోర్డును అందుబాటులోకి తేవాలని దేవాదాయ శాఖ అధికారులకు సూచించారు.

అన్ని శాఖలు సమష్టిగా పని చేస్తేనే యాత్రికులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పుష్కరాలు విజయవంతం అవుతాయన్నారు. శాఖల మధ్య సమన్వయం లోపాలు తలెత్తకుండా సంబంధిత ఉన్నతాధికారులు ప్రత్యేకంగా చొరవ తీసుకోవాలన్నారు. పుష్కరాలకు వచ్చే యాత్రికులకు రవాణా పరంగా ఎలాంటి అంతరాయం కలగకుండా ప్రతి రోడ్డును అనుసంధానించాలని ఆదేశించారు. ఎక్కడైనా రోడ్డు కనెక్టివిటీ మిస్ అయితే వెంటనే గుర్తించి, లోకల్ ఫండ్స్ నుంచి పనులు చేపట్టాలని సూచించారు. స్థానిక ప్రజాప్రతినిధులు, కలెక్టర్లు, ఎస్పీలు, ఇతర జిల్లా ఉన్నతాధికారులు, పండితులను పుష్కర ఏర్పాట్లలో తప్పనిసరిగా భాగస్వామ్యం చేయాలని కోరారు. యాత్రికులకు సేవలు అందించేందుకు ముందుకొచ్చే స్వచ్ఛంద, ప్రయివేటు సంస్థలను ముందుగానే గుర్తించాలని సూచించారు. క్యాబినెట్ సబ్ కమిటీ సభ్యుల సలహాలు, సూచనలను తప్పనిసరిగా పరిగణనలోకి తీసుకుని, అందుకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు స్పష్టం చేశారు. పుష్కర ఏర్పాట్లలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

పుష్కరాలపై సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్ బాబు

నిబంధనలకు విరుద్ధంగా భూముల కేటాయింపు

- 'టెస్సరాక్ట్' పై లోకాయుక్తకు బిఆర్ఎస్ ఫిర్యాదు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నిబంధనలకు విరుద్ధంగా 'మెసర్స్ టెస్సరాక్ట్ అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ ప్రయివేట్ లిమిటెడ్' సంస్థకు భూములను కట్టబెట్టారని లోకాయుక్తకు బిఆర్ఎస్ ఫిర్యాదు చేసింది. ఈ మేరకు శుక్రవారం సదరు ఫిర్యాదును ఎమ్మెల్సీలు డాక్టర్ దాసోజు శ్రవణ్ కుమార్, మంకెన కోటి రెడ్డి,ఎమ్మెల్యేలు కాలేరు వెంకటేష్, ముఠా గోపాల్, డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల, బిఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ డాక్టర్ మన్నె క్రిశాంక్ లు లోకాయుక్తకు స్వయంగా ఫిర్యాదు అందజేశారు. రంగారెడ్డి జిల్లాలో సుమారు రూ. 135 కోట్ల నుంచి రూ.200 కోట్ల మార్కెట్ విలువ కలిగిన ఐదెకరాల ప్రజా భూమిని నిబంధనలకు విరుద్ధంగా టెస్సరాక్ట్ కు అప్పగించారని ఆరోపించారు.

టెస్సరాక్ట్ చైర్మన్‌గా సిఎం సోదరుడు కొండల్ రెడ్డి 'చైర్మన్'గా అధికారిక ప్రకటనలు చేశారని తెలిపారు. ఏరోస్పేస్ అండ్ డిఫెన్స్ సామర్థ్యాలను నిర్మిస్తున్న పారిశ్రామికవేత్తగా తన వెరిఫైడ్ లింక్డ్ఇన్ ప్రొఫైల్‌లో పేర్కొన్నారని చెప్పారు. అంతర్జాతీయ వేదికలో చైర్మన్ హోదాలో పాల్గొన్నారని పేర్కొన్నారు. కేటాయింపులకు ముందే సిఎం మేనల్లుడు సయన్ రెడ్డి పూర్తికాల 'సిఇఒ'గా పని చేస్తున్నట్టు తన వెరిఫైడ్ ప్రొఫైల్‌లో ప్రకటించుకున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. భూ కేటాయింపులు జరగడానికి దాదాపు ఐదు నెలల ముందే ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు వ్యక్తులు చైర్మన్, సిఇఒలుగా ఈ సంస్థపై పట్టు సాధించారని చెప్పారు. ఏరోస్పేస్, డిఫెన్స్ ప్రెసిషన్ మ్యానుఫ్యాక్చరింగ్, ఫోర్జింగ్, కాస్టింగ్ చేపడుతున్నామని ప్రచారం చేసుకుంటున్న కంపెనీ క్షేత్రస్థాయి పరిశీలనలో చిన్న గోడౌన్/షాప్-ఫ్రంట్ యూనిట్ మాత్రమే తేలిందని తెలిపారు. అధికారిక రికార్డుల ప్రకారం కంపెనీ శాసనబద్ధమైన రిజిస్టర్డ్ కార్యాలయం 'ప్రసూన నిలయం' అనే చిన్న రెసిడెన్షియల్ అపార్ట్‌మెంట్ ఫ్లాట్‌లో ఉందనీ, అది ఎలాంటి పారిశ్రామిక లేదా వాణిజ్య సంస్థ కాదని తెలిపారు. ఒక్క ఉద్యోగి కూడా లేని కంపెనీకి డిఫెన్స్ భూములు ఎలా ఇస్తారు? అని వారు ప్రశ్నించారు. యూరోపియన్ యూనియన్ ఆడిట్ ఫోటోలతో తప్పుడు ప్రచారం చేసుకున్న కంపెనీకి రూ. 200 కోట్ల విలువైన భూమిని కేవలం రూ.ఐదు కోట్లకు ధారాదత్తం చేశారని ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ భూములను బహిరంగ వేలం లేకుండా ఏకపక్షంగా కేటాయించడం రాజ్యాంగ విరుద్ధమని సుప్రీంకోర్టు స్పష్టం చేసిందని గుర్తుచేశారు. విచారణ పూర్తయ్యే వరకు రావిర్యాలలోని సదరు భూ కేటాయింపును తక్షణమే నిలిపివేయాలనీ, అక్రమ కేటాయింపును రద్దు చేసి ప్రజా భూమిని స్వాధీనం చేసుకోవాలని కోరారు.

దోస్త్ స్పెషల్ డ్రైవ్‌లో 14,975 మందికి సీట్లు కేటాయింపు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దోస్త్ -2026 స్పెషల్ డ్రైవ్‌లో 14,975 మంది సీట్లు దక్కించుకున్నారు. ఈ మేరకు శుక్రవారం దోస్త్ కన్వీనర్, తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ డాక్టర్ బాలకిష్టా రెడ్డి, కళాశాల విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన ఒక ప్రకటన విడుదల చేశారు. మొదటి ప్రాధాన్యత ద్వారా 12,069, రెండో ప్రాధాన్యత , ఇతర ప్రాధాన్యతల ద్వారా 2,906 మంది సీట్లు పొందారు. చాలా తక్కువ వెబ్-ఆప్షన్లు ఇచ్చిన 1,337 మంది విద్యార్థులకు సీట్లు కేటాయించలేదు. స్పెషల్ డ్రైవ్ ఫేజ్ లో 16,312 మంది అభ్యర్థులు వెబ్ ఆప్షన్లు ఇచ్చారు. విద్యార్థులు తమ రిజిస్టర్డ్ మొబైల్ నెంబర్‌కు ఎస్ఎంఎస్ ద్వారా, దోస్త్ అభ్యర్థి లాగిన్ ద్వారా, అభ్యర్థన మేరకు వాట్సప్ ద్వారా సీట్ల కేటాయింపు వివరాలను పొందవచ్చని వారు తెలిపారు. సీట్లు పొందిన అభ్యర్థులు ఆన్ లైన్ సెల్ఫ్ రిపోర్టింగ్ అనంతరం ఈ నెల 17వ తేదీ నుంచి 18వ తేదీ లోపు సంబంధిత కళాశాలలో తప్పనిసరిగా హాజరై ప్రవేశ ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు.

తలసేమియా రోగులకు అందుబాటులోకి జన్యు చికిత్స: టిఎస్‌సిఎస్

ప్రజాశక్తి - హైదరాబాద్

భారతదేశవ్యాప్తంగా ఉన్న తలసేమియా రోగులకు అధునాతన జన్యు చికిత్సను అందుబాటులోకి తీసుకురావడానికి తలసేమియా అండ్ సికిల్ సెల్ సొసైటీ (టిఎస్‌సిఎస్) శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా అంతర్జాతీయ గుర్తింపు పొందిన థాయ్‌లాండ్‌లోని ప్రముఖ చికిత్సా కేంద్రాలను టిఎస్‌సిఎస్ ప్రతినిధి బృందం, ప్రముఖ బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంట్ (బిఎంటి) నిపుణులు డాక్టర్ సునీల్ భట్ బృందంతో కలిసి సందర్శించింది. ఈ అధ్యయన పర్యటనలో టిఎస్ సిఎస్ అధ్యక్షుడు డాక్టర్ చంద్రకాంత్ అగర్వాల్, కార్యదర్శి డాక్టర్ సుమన్ జైన్, ఉపాధ్యక్షుడు నరేష్ రావ్, శాస్త్రవేత్త డాక్టర్ నిశాంత్ మిట్టల్ పాల్గొన్నారు. రోగులు జీవితాంతం రక్త మార్పిడిపై ఆధారపడే అవసరం లేకుండా దీర్ఘకాలిక ఉపశమనం కలిగించేలా, అంతర్జాతీయ వైద్య నిపుణుల భాగస్వామ్యంతో ఈ విప్లవాత్మక చికిత్సను దేశీయంగా వేగంగా అందుబాటులోకి తెచ్చేందుకు చర్యలు వేగవంతం చేస్తున్నామని డాక్టర్ చంద్రకాంత్ అగర్వాల్ వెల్లడించారు.

ఉపాధి టెన్యూర్ సిబ్బందికి జీతాలు బంద్

- మూడు నెలలుగా ఎదురు చూపు
- వాటా చెల్లించని కేంద్ర ప్రభుత్వం
- రాష్ట్రం చెల్లిస్తామన్నా కేంద్రం మెలిక
- ఇబ్బందుల్లో 3,800 మంది ఉద్యోగులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఉపాధిహామీ చట్టం ద్వారా రాష్ట్రంలో నియమితులైన ఫిక్స్ డ్ టెన్యూర్ ఉద్యోగులు మూడు నెలలుగా జీతాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కేంద్రం ఇటీవల తీసుకొచ్చిన వీబీ గ్రామ్ జి కొత్త చట్టం ప్రకారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వాటాను 60:40 శాతంగా నిర్ణయించారు. అయితే కేంద్రం తన వాటా చెల్లించనందున 3,800 మంది ఉద్యోగుల జీతాలు నిలిచిపోయాయి. ఉద్యోగులు ఇబ్బందులు పడకుండా రాష్ట్ర ప్రభుత్వం ముందుగా జీతాలు చెల్లించి, అనంతరం ఆ మొత్తాన్ని రీయింబర్స్ చేసుకునే ప్రతిపాదన చేసినప్పటికీ కేంద్ర ప్రభుత్వం అంగీకరించడం లేదు. ఫలితంగా ఫిక్స్ డ్ టెన్యూర్ ఉద్యోగుల జీతాలు ఆగిపోయాయి.

ఉపాధి హామీ పథకంలో పని చేసేందుకు ఎపిఒ, టిఎ తదితర క్యాడర్లలో 2006లో రాష్ట్రంలో పీరిని డిస్ట్రిక్ సెలక్షన్ కమిటీ (డిఎస్‌సి) ద్వారా అప్పటి రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వం భర్తీ చేసింది. రెండేండ్ల కాంట్రాక్ట్ పద్ధతిన 3,800 మంది ఉద్యోగులను నియమించారు. ఆ తర్వాత సొసైటీ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్ పథకం కింద హెచ్ఆర్ పాలసీ తీసుకొచ్చి వారిని కంటిన్యూ చేస్తూ వచ్చింది. దాదాపు 20 ఏండ్ల నుంచి ఈ విభాగంలో ఎలాంటి ఉద్యోగ భద్రత లేకుండా వీరు పని చేస్తున్నారు. కేంద్రంలోని మోడీ సర్కార్ ఉపాధి హామీని కాస్త వీబీ గ్రామ్ జి పథకంగా మార్చినప్పటి నుంచి తన వాటా చెల్లించడం లేదు. ఫలితంగా ఈ విభాగంలో పని చేస్తున్న టెన్యూర్ ఉద్యోగుల జీతాలు ఆగిపోయాయి.

అమలు కాని పే స్కేల్

ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న ఫిక్స్ డ్ టెన్యూర్ ఉద్యోగులకు పే స్కేల్ అమలు చేయడంతో పాటు వారి సమస్యలన్నీ పరిష్కరిస్తామని ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టోలో పేర్కొంది. మూడేండ్లు కావస్తున్నా ఇప్పటి వరకు ఎలాంటి చొరవ చూపలేదు. పే స్కేల్ అమలు చేస్తే ప్రభుత్వంపై ప్రతి నెలా రూ.2.5కోట్ల చొప్పున ఏడాదికి రూ.30 కోట్ల అదనపు భారం మాత్రమే పడుతుంది.

ఇబ్బందులు పడుతున్నాం: ఉద్యోగులు

జీతాలు సకాలంలో రాక పోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ఈఎంఐలు, ఇంటి అద్దెలు సమయానికి చెల్లించలేక పోతున్నాం. చాలా మంది ఉద్యోగుల సిబిల్ స్కోర్ పడిపోయింది. బ్యాంకుల తోపాటు ఏ ప్రయివేట్ ఫైనాన్స్‌లు కూడా అప్పులు ఇవ్వడానికి జంకుతున్నాయి.

కేంద్రం వాటా సకాలంలో చెల్లించక పోయినా రాష్ట్ర ప్రభుత్వం పే స్కేల్ అమలు చేయడంతో పాటు

క్యాడర్ స్ట్రెంత్ ఖరారు, బదిలీల విధానం, 2011 ధరల ప్రకారం నిర్ణయించిన ట్రావెలింగ్ అలవెన్స్‌ను రూ.రెండు వేల నుంచి రూ.ఐదు వేలకు పెంచాలి. రాబోయే నాలుగు నుంచి ఐదు సంవత్సరాల్లో పలువురు ఉద్యోగులు పదవీ విరమణ చేయనున్నందున ప్రభుత్వంపై పడే ఆర్థిక భారం కూడా క్రమంగా తగ్గుతుంది. వీబీ గ్రామ్ జి పథకంలో పని చేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్లకు రూ.ఐదు వేల ప్రత్యేక అలవెన్స్ ఇవ్వాలి.

కేంద్రం వల్లే జాప్యం...సీతక్క

కేంద్ర ప్రభుత్వం తన వాటా చెల్లించనందున గత మూడు నెలలుగా ఫిక్స్ టెన్యూర్ ఉద్యోగుల జీతాలు నిలిచిపోయాయి. ఉద్యోగులు ఇబ్బందులు పడకుండా రాష్ట్ర ప్రభుత్వం ముందుగా జీతాలు చెల్లించి, అనంతరం ఆ మొత్తాన్ని తీసుకునే ప్రతిపాదన చేసినప్పటికీ కేంద్ర ప్రభుత్వం అంగీకరించలేదు. ఈ కారణంగానే జీతాల విడుదలలో జాప్యం జరుగుతోంది. రాష్ట్ర ప్రభుత్వం వారికిచ్చిన హామీలన్నీ ఒక్కొక్కటిగా పరిష్కరిస్తోంది. ఇప్పటికే వారికి ప్రమాద బీమా (ఆక్సిడెంటల్ ఇన్సూరెన్స్) పథకాన్ని వర్తింపజేస్తున్నాం.

తెలంగాణ గొంతుక కాళోజీ

- కాళోజీ కళాక్షేత్రంను సందర్శించిన సిపిఐ నేత నారాయణ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తన కలంతో తెలంగాణ గొంతుకై నిలిచిన ప్రజాకవి, ధిక్కార స్వరం కాళోజీ అని సిపిఐ జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ డాక్టర్ కె. నారాయణ అన్నారు.శుక్రవారం హనుమకొండలోని కాళోజీ కళాక్షేత్రాన్ని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావుతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా కాళోజీ దుస్తులను, వారు రాసిన కవితల పుస్తకాలను, కళా కళాక్షేత్రంను పరిశీలించి, కాళోజీ విగ్రహానికి శ్రద్ధాంజలి ఘటించి నివాళులు అర్పించారు. అనంతరం నారాయణ మాట్లాడుతూ సిపిఐ జాతీయ సమితి పిలుపు మేరకు ఆగస్టు 6వ తేదీ నుండి 14వ తేదీ వరకు కేంద్ర బిజెపి ప్రభుత్వంకు వ్యతిరేకంగా సిపిఐ పాదయాత్రలు చేస్తుందని, శుక్రవారం వరంగల్ సిపిఐ పాదయాత్ర ముగింపు కార్యక్రమానికి రావడం జరిగిందని తెలిపారు.



కాళోజీకి నివాళులర్పిస్తున్న నారాయణ

జర్నలిస్టుపై బిజెపి ఎంపి అర్వింద్ బరితెగింపు వ్యాఖ్యలు

- క్షమాపణ చెప్పాలని టిడబ్ల్యుజెఎఫ్ డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జర్నలిస్టుపై బిజెపి ఎంపి అర్వింద్ అసభ్యకరమైన వ్యాఖ్యలు చేయడాన్ని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టిడబ్ల్యుజెఎఫ్) తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు ఫెడరేషన్ రాష్ట్ర యాక్టింగ్ ప్రెసిడెంట్ పి రాంచందర్, ప్రధాన కార్యదర్శి బి. బసవపున్నయ్య శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. హైదరాబాద్‌లోని బిజెపి కార్యాలయంలో ప్రెస్‌మీట్‌లో ఎంపీ అర్వింద్ మాట్లాడుతూ 'ఇప్పటిదాకా చెప్పిన కదా బేవకూఫ్..వినాలే' అంటూ పరుషంగా మాట్లాడటం సిగ్గుచేటని వ్యాఖ్యానించింది. ప్రెస్‌మీట్లు పెట్టి మీరు చెప్పిందే రాసుకోవాలా ? ప్రశ్నలు అడగకూడదా ? అని ఎంపీని ప్రశ్నించారు.